క్లుప్తంగా

ఒక ఈతలో రెండు దూడలు



రెండు దూడలతో పాడి ఆవు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ కావేరిరాజుపురం గ్రామానికి చెందిన పాడి రైతు దిలీప్‌కుమార్ పాడి పశువు ఆదివారం ఒకే ఈతలో రెండు దూడలు ఈనింది. పాడి పశువులు ఒక ఈతకు ఒక దూడ మాత్రమే ఈనుతాయి. అయితే దిలీప్‌కుమార్ పాడిపశువు ఒకే ఈతలో రెండు దూడలు ఈనింది. రెండు దూడలు లేచి పాడిపశువుల్లో పాలు తాగుతున్నాయి. రెండు దూడలు కూడా ఆరోగ్యంగానే ఉన్నాయి.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా దేవరాజులురెడ్డి



దేవరాజులురెడ్డి

వెదురుకుప్పం: లయన్స్ క్లబ్ తిరుపతి టెంపుల్ టౌన్ నూతన అధ్యక్షుడిగా మండలంలోని ఆళ్లమడుగు పంచాయతీ బుచ్చిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు కామసాని దేవరాజులురెడ్డిని నియమించినట్లు ఆ శాఖ ప్రకటించింది. ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యదర్శిగా ధనంజయరెడ్డి, ట్రెజరర్‌గా షేక్‌జహీర్‌లను ఎన్నుకున్నామన్నారు. అదేవిధంగా సభ్యులను ఎన్నుకుని, ప్రమాణ స్వీకారం చేయించినట్లు సామిరెడ్డి చిట్టిబాబు రెడ్డి చెప్పారు. పారిశ్రామిక వేత్త పట్టుబాల చిరంజీవిరెడ్డి, ప్రతినిధులు మారుసాని జ్ఞానేంద్రరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, లోకనాథం పాల్గొన్నారు.

కార్యవర్గంలో ఇద్దరికి చోటు




జయంత్‌బాబు, సుబ్రమణ్యం

వడమాలపేట (పుత్తూరు): ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో నూతనంగా అంబేడ్కర్ కోఆపరేటివ్ చైర్మన్‌గా పి.జయంత్‌బాబు, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా డి.సుబ్రమణ్యంను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నాగరాజు, జనరల్ సెక్రెటరీ మస్తాన్, వెంకటస్వామి, వెంకటేష్, నాగేంద్ర, శశి పాల్గొన్నారు.

ఆటోవాలాకు కూటమి పోటు

- రూ.15 వేలు ఊసెత్తని కూటమి సర్కార్
- ఏకపక్షంగా ఉచిత బస్సు పథకం ప్రకటన

పాలసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఏకపక్షంగా ప్రకటించేసింది. దీంతో ఆటో కార్మికులు ఫైనాన్స్ బకాయిలు చెల్లించలేక ఆందోళన చెందుతున్నారు. స్త్రీశక్తి పథకం తమ భుక్తిని లాగేసుకుంటుందని భయపడుతున్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసినా తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడిపోయి, కుటుంబాలను పోషించుకోవడం ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర అయినా ఎన్నికల్లో ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ ఊసే లేదని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సుమారు 3 వేల ఆటోలు ఉన్నాయి. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాని యువత సైతం కుటుంబ పోషణకు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థికంగా స్తోమత లేకపోయినప్పటికీ ఫైనాన్స్‌లో ఆటో తీసుకొని వచ్చి బాడుగలతో వచ్చే ఆదాయంతో కొంత కుటుంబానికి, కొత్త అప్పులు తీసుకుని ఫైనాన్స్ కట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టి ఆటో కార్మికులకు నెత్తిన పిడుగుపడినట్లు అయ్యింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తమ ఆటోలు స్టాండ్‌లోనే ఉంటున్నాయంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఆటో కార్మికులు జీవనం ఎలా చేయాలని కన్నీరు పెట్టుకుంటున్నారు.

అమలు కాని హామీ

అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకూ ఏటా రూ.15 వేలు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ఆర్థిక సహాయంతోపాటు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని నమ్మబలికింది. అధికారం చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా ఆటో కార్మిలకు ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇకనైనా అమలు చేస్తామని భరోసా కల్పించడం లేదు. సంక్షేమ బోర్డు ఊసెత్తడం లేదు. తక్కువ వడ్డీతో ఆటో రుణాలు ఇస్తామన్న హామీకి అతీగతీ లేదు. తీరా స్త్రీశక్తి పథకం అమలు చేయడంతో ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతినింది. ఉచిత బస్సు ప్రభావంతో ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేని పరిస్థితి వచ్చింది. హామీలు అమలు చేయాలని పలురూపాల్లో కార్మికులు ఆందోళన చేసిన ప్రభుత్వం నుంచి కనీసం స్పందన లేదు.



ప్రయాణికులు రాకపోవడంతో బలికండ్రిగ ఆటో స్టాండ్‌లో ఉన్న ఆటోలు



వాహన మిత్రతో ఆదుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆటో కార్మికులు(ఫైల్)

అప్పట్లో ఆదుకున్న వాహనమిత్ర

గత ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. వారి సంక్షేమానికి వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టింది. ఆటో ఉన్న ప్రతి కార్మికుడికి ఏటా రూ.10 వేలు వాహన మిత్ర కింద ఆర్థిక సహాయం చేసింది. దీంతోపాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా అందించేవారు. రవాణా వాహనం కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్‌కు రూ.3 లక్షల వరకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించారు. దీంతో కుటుంబం ఇబ్బందులు లేకుండా దర్జాగా ఉండేవారు. కరోనా లాంటి కష్టకాలంలోనూ వరుసగా క్రమం తప్పకుండా ఆర్థిక సహాయం అందించారు. ఆటో కార్మికుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎలాంటి భరోసా లేకపోవడం గమనార్హం.

భారమైన కుటుంబ పోషణ



కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రిలే దీక్షలు చేపడుతాం.

-డి.రవి, సీఐటీయూ, అధ్యక్షుడు

రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలి



ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులకు 50 నుంచి 60 శాతం ఉపాధి పోయింది. ఇప్పటికే పలురకాల సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని ఇవ్వలేదు. ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం స్పందించి నెలనెలా రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలి.

-చిన్నతంబి, ఆముదాల, ఆటో కార్మికుడు

రూ.15 వేలు అందించాలి



రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతోపాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏటా ఇస్తామన్న రూ.15 వేలు సాయం అందించాలి.

-రజని, ఆముదాల, ఆటోడ్రైవరు

మా పొట్ట కొట్టారు



పదిహేనేళ్లుగా ఆటో నడుపుతున్నా. ఇదే నా జీవనాధారం. దీని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఆటోలో ప్రయాణించే వారిలో 80 శాతం మంది మహిళలే స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశారు. ప్రస్తుతం ఆటో ఎక్కేవారే లేరు. మా పొట్టను కొట్టినట్టే. మేం ఉపాధి కోల్పోయాం. అప్పులు తీర్చడం కష్టమే.

-ఇళయరాజ్, ఆటో డ్రైవర్

ఉపాధ్యాయుడికి తెలుగుతేజం పురస్కారం



తెలుగు తేజం అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు కరణం గిరిబాబు

కార్వేటినగరం: ఐఎస్ఓ గుర్తింపు పొందిన సాహిత్యంలో 36 ప్రపంచ రికార్డులు సాధించిన జాతీయ సాహిత్య సాంస్కృతిక, సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదికవారు కార్వేటినగరానికి చెందిన ఉపాధ్యాయుడు కరణం గిరిబాబుకు తెలుగు తేజం పురస్కారం అందించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదిన వేడుకల సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావు పేటలో ఆదివారం పురస్కారాన్ని అందుకున్నారు. గిరిబాబు సోదరుడు కరణం శివప్రసాద్‌తోపాటు, కార్వేటినగరం మండల విద్యాశాఖలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న కొత్తకోట్ల గణేష్ కూడా అందుకోవడం విశేషం. ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, గ్రామస్తులు వారిని అభినందించారు.

విజేతలకు బహుమతి ప్రదానం



యువకులకు ట్రోఫీ అందిస్తున్న వైస్ ఎంపీపీ

నగరి: మండలంలోని తడుకు దళితవాడలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన మహిళా కబడ్డీ, పురుషుల కబడ్డీ, ఉట్టికొట్టే పోటీల్లో విజేతలకు వైస్ ఎంపీపీ కన్నియప్ప బహుమతులు అందించారు. ఆదివారం వినాయక ప్రతిమ ఏర్పాటు చేసిన ప్రాంతంలో పోటీల్లో విజేతలుగా నిలిచిన 20 మంది మహిళలకు చీరలు, యువకులకు ట్రోఫీలు బహూకరించారు.

ఉపాధిలో ఆగని దోపిడీ



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పాలసముద్రం: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రారంభమై పందొమ్మిది సంవత్సరాలు పూర్తయినా గ్రామీణ పేదలకు ఈ పథకంలో పనులు కల్పించడంలో పాలక వర్గాలు పూర్తిగా విఫలమయ్యారు. పాలసముద్రం మండలంలోని 13 పంచాయతీలకు రెండు, మూడు గ్రామాల్లో మాత్రమే కూలీలకు పనులు కల్పిస్తున్నారు. మిగతా గ్రామాల్లో మాత్రం క్షేత్రసహాయకులకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే పనులు కల్పిస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఒకే కుటుంబానికి రెండు, మూడు జాబ్‌కార్డులు సృష్టించి వారి పేరు మీద దొంగ బిల్లులు పెట్టి రోజు రోజుకి ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తున్నారు. నిజమైన పేదలు పనులు దొరకక సరిహద్దు ప్రాంతమైన తమిళనాడు రాష్ట్రానికి వలసలు వెళ్లి పనులు చేసుకుంటున్నారు. వనదుర్గాపురం పంచాయతీలో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలకు ఐదు ఎకరాలకు పైగా పొలం ఉంది. కానీ వారు చిన్న సన్నకారు రైతు అని క్షేత్ర సహాయకురాలు ధ్రువపత్రాలు సృష్టించి, వారికి ఉపాధి హామీ పథకంలో మొక్కలు మంజూరు చేసి, నాటించారు. పలు పంచాయతీలలో పనిచేసే క్షేత్ర సహాయకులు నిత్యం అధికార పార్టీ నాయకులతో తిరుగుతుండడంతో అధికారులు కూడా పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాల్సిన అధికారులు ఇంతవరకు ఈ కార్యక్రమం చేపట్టలేదు. మండలంలో చాలా రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటాలని ప్రజలు ఉపాధిహామీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా కూడా పట్టించుకునే నాథుడు లేడని ప్రజలు అంటున్నారు.

క్రికెట్ విజేత పెద్దతయ్యూరు



గెలుపొందిన పెద్దతయ్యూరు జట్టు

శ్రీరంగరాజపురం: వినాయక చవితి క్రికెట్ టోర్నమెంట్‌ను జీడీనెల్లూరు మండలం దళవాయిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో మండలానికి చెందిన చిన్నతయ్యూరు జట్టుపై పెద్దతయ్యూరు గ్రామం జట్టు క్రీడాకారులు విజేతగా నిలిచారు. గెలుపొందిన జట్టుకు రూ.60 వేలు నగదు, రన్నర్స్ జట్టుకు రూ.30 వేలు బహుమతితో పాటు, మెడల్స్, కప్‌ను అందించారు. ఈ క్రీడలలో ప్రతిభ చాటిన అనిల్, నవీన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శశికుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను అందించారు. క్రీడాకారుల జట్టుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ వరదమ్మ క్రీడాకారులను అభినందించి, సన్మానం చేశారు.

వైఎస్ఆర్ సీపీ నేతకు పరామర్శ



నరసింహులునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పంచాయతీ బసిరెవిడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు నరసింహులు నాయుడుని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదివారం పరామర్శించారు. వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావం నుంచి తనదైన శైలిలో పార్టీని ముందుకు నడిపించిన నరసింహులునాయుడు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో మంచం పట్టారు. పరిస్థితి పూర్తిగా విషమించడంతో సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నరసింహులునాయుడు ఆయన గృహానికి వెళ్లి చూశారు. ఆయన పరిస్థితి చూసి ఉద్వేగానికి గురయ్యారు. అనంతరం నరసింహులునాయుడు కుమారుడు వెంకటరత్నంకు ధైర్యం చెప్పారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం



బాధితురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న దాత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ బాధితురాలికి దాత పార్థసారథి నాయుడు ఆర్థికసాయం అందజేశారు. చిత్తూరు నగరం వీరభద్రకాలనీకి చెందిన రోషిణి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలిసి ఆదివారం దాత రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. రోషిణి గత కొంతకాలంగా తిరుపతిలోని స్విమ్స్‌లో డయాలసిస్ చేయించుకుంటుండడంతో ఈ సాయం అందజేశారు.

వైభవంగా నిమజ్జనోత్సవం

పుత్తూరు: వినాయక చవితిని పురస్కరించుకొని ఐదో రోజు ఆదివారం సాయంత్రం పుత్తూరు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి నిమజ్జనానికి విగ్రహాలు అట్టహాసంగా బయలుదేరి వెళ్లాయి. ఈ సందర్భంగా మండపాల నుంచి బయల్దేరిన యువత రంగులు చల్లుకొంటూ బాణాసంచా పేలుస్తూ, మేళతాళాల నడుమ వైభవంగా ఉత్సవ విగ్రహాలు ఒకదాని వెంట మరొకటి బయల్దేరి వెళ్లాయి. పట్టణంలోని మండపం వీధి, మంచినీళ్ల గుంట, లక్ష్మీనగర్‌కాలనీ, గేట్‌పుత్తూరు, కాపువీధి, ఆరేటమ్మ కాలనీ, ఆర్టీసీకాలనీల విగ్రహాలను నిమజ్జనం చేశారు. నెత్త చెరువు, గోవిందపాళెంచెరువు, నారాయణవనం రోడ్డు చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెరువుల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా నిమజ్జనం

పాలసముద్రం: వినాయక చవితి ఐదో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు, కొన్ని గ్రామాల్లో నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పందిళ్లలో భారీ వినాయక విగ్రహాలను మూడు రోజులపాటు పవిత్రంగా పూజించారు. గ్రామంలో వినాయక చవితికి ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. విగ్రహాలను ట్రాక్టర్‌లో గ్రామాల్లో ఊరేగించి యువకులు పలురంగుల పొడర్లను ఒకరిపై ఒక్కరు చల్లుకుని స్వామివారికి ఎదుట డప్పు వాయిస్తూ ఆటపాటలు పాడుతూ ప్రతి ఇంటి నుండి పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చి స్వామికి నైవేద్యం చేశారు. అనంతరం గ్రామానికి సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.



పుత్తూరు: నిమజ్జనానికి తరలుతున్న మంచినీళ్లగుంట వినాయకుడు



నిమజ్జనానికి గణపయ్య

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని పెద్దతయ్యూరు గ్రామంలో గణనాథుల నిమజ్జనం కనులపండువగా సాగింది. ఆదివారం చెరువు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలం నెలకొంది. ఊరేగింపుగా వస్తున్నా గణనాథులకు భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: యువత ఆదివారం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెదురుకుప్పం, సీఆర్‌కండ్రిగ, పచ్చికాపల్లం, నల్లవెంగనపల్లె, తూర్పు దళితవాడ, బొమ్మన్‌దొడ్ల, నల్లవెంగనపల్లె, జక్కిదొన, వేణుగోపాలపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను నివేదించారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు పంచాయతీలోని ఎగవూరు గ్రామం, దళితవాడల్లో యువకులు గ్రామస్తులు ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమలను ప్రత్యేక పుష్పాలంకరణలతో నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

విజయపురం: మండలంలోని వినాయకచవితి సందర్భంగా 5వ రోజు గ్రామీణ ప్రాంత ప్రజలు ఆదివారం ఉల్లాసంగా... ఉత్సాహంగా కనిపించారు. పల్లె పల్లెలో వినాయక విగ్రహాల ఎదురుగా యువత నృత్యాలు అలరించాయి. సాయంత్రం యువతులు ఉట్టి పోటీలో పాల్గొని, తన ప్రతిభను కనబరిచారు. అనంతరం స్వామివారి ఊరేగింపు సాగింది. ప్రజలు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుని నిమజ్జనం చేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: కార్వేటినగరంలోని సాయి బాలాజీ నగరంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి బాణసంచా పేలుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు పద్మసరస్సు సమీపంలోని కోట చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు. నిర్వాహకులు మునిరత్నంరెడ్డి, సురేష్, వాసు, గౌతంరాజు, జయప్రకాష్, నటరాజు, పొన్నురంగం తదితరులు పాల్గొన్నారు.






వినాయకుని ఊరేగింపు, వెదురుకుప్పం: వేణుగోపాలపురంలో పూజలు చేస్తున్న భక్తులు, పుత్తూరు: నిమజ్జనానికి మండపం వీధి వినాయకుడు, ఉట్టి పోటీల్లో పాల్గొన్న యువకులు



వినాయకునికి నిమజ్జన పూజలు



సాయిబాలాజీ నగరం నుంచి వినాయకుడి ఊరేగింపు



జీడీ నెల్లూరులో వినాయక నిమజ్జన వేడుకలు

రూ.లక్ష దాటిన వినాయకుని లడ్డూ



లడ్డును దక్కించుకొన్న రవికుమార్‌రాజు

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురం గ్రామంలో వినాయక చవితి వేడుల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన లడ్డు వేలం పాట రికార్డు స్థాయిలో ధర పలికింది. గ్రామానికి చెందిన రవికుమార్‌రాజు 1,11,116 రూపాయలకు లడ్డును దక్కించుకొన్నారు. ఈ సందర్భంగా వినాయకస్వామిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు.

అట్టహాసంగా దుర్యోధన వధ ఘట్టం



గాజులపల్లెలో దుర్యోధన వధ ఘట్టం

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో 18 రోజుల పాటు భక్తిభావంతో నిర్వహించిన మహాభారత యజ్ఞం ముగిసింది. ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అద్భుతంగా ప్రదర్శించారు. గాజులపల్లెలో ఈ నెల 15వ తేదీన మహాభారత యజ్ఞం ప్రారంభమైంది. భాగవతార్ ఉషారాణి హరికథను ఆలపించారు. శనివారం ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు, పోతురాజు అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నుంచి రాత్రి నాటకం నిర్వహించారు. మడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీముడి వేషధారిని బయటకు లాక్కుని వచ్చి వధించే ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609